సంక్షేమం, అభివృద్ధే అజెండా

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



స్థానిక నగర పంచాయతీలో సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అజెండా అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-3లో 18, 19 వార్డుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును వివరించారు. మంచినీటి సమస్య, పింఛన్ల సమస్యలను పలువురు మహిళలు పీవీఎల్ దృష్టికి తీసుకువచ్చారు. మంచినీటి సమస్య పరిష్కారానికి నగర పంచాయతీ తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. పింఛన్ మంజూరులో ఉన్న నిబంధన మేరకు విద్యుత్ వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. బిల్లులు తగ్గిన తరువాత మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరు అవుతుందని పీవీఎల్ చెప్పారు. మాట తప్పని, మడం తిప్పని విధంగా పాదయాత్రలో చేసిన వాగ్దానాలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని పీవీఎల్ చెప్పారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో గూడుకట్టుకుంటున్నాయన్నారు. అభివృద్ధి పనులు ప్రజా శ్రేయస్సుకు ఉపయోగపడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 30 ఏళ్లుగా పరిపాలన సాగించిన టీడీపీ ఒక్క శాశ్వత అభివృద్ధి పథకం లేదన్నారు. దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి, సీఎం జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలోనే అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని పీవీఎల్ అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్‌విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు నిమ్మల నాగు, అప్రపున్నీసా బేగం, ఎండీ. ఆలీ, మోటుపల్లి కుమారి, తిమ్మారెడ్డి మాధవి, గేదల అప్పారావు, ఎండీ.జక్కీ, గుంతడుగొలను సావిత్రీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతువిజయ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు,శిరపు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంబటి రమేష్, జామి శ్రీనివాస్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: సమాజంలో ప్రతి అక్క, చెల్లెమ్మ సంతోషంగా ఉండాలని, కుటుంబంలో మహిళలు సంతోషంగా ఉంటేనే ఆ కుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మహిళలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో మహిళల పేరు మీదనే ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళల రక్షణగా కట్టుదిట్టమైన చట్టాన్ని కూడా తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి అక్కను, చెల్లెమ్మను మరింత ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని అన్నారు. అనంతరం పలువురు మహిళలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు రాఖీలు కట్టారు.

శృంగవృక్షంలో పొలంబడి



శృంగవృక్షంలో నిర్వహిస్తున్న పొలంబడి

పాలకోడేరు: శృంగవృక్షంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వీవీఏ సత్యనారాయణ రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వరిలో తెగుళ్లు, పురుగులు, వరి దుబ్బులను కటింగ్ చేసి రైతులకు చూపించారు. ఎంత మోతాదులో ఫెర్టిలైజర్స్ వాడుకోవాలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రవికుమార్ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తినడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు.

దళితుల సమస్యల పరిష్కారం కోసం కృషి



మాట్లాడుతున్న పొన్నమండ బాలకృష్ణ

పాలకోడేరు: దళితుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని, సమాజం లో అంతరాలు లేకుండా జీవించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మనకు ఆయుధమని ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. బుధవారం శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జంగం సూరిబాబు అధ్యక్షతన జరిగిన సివిల్ రైట్స్ డే కు ముఖ్య అతిథిగా బాలకృష్ణ హాజరయ్యారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టం గురించి తెలుసుకోవాలని , రాజ్యాంగం గురించి అవగాహన చేసుకుని, యువతరానికి వివరించాలని అన్నారు. సర్పంచ్ జంగం సూరిబాబు కోరం ముసలయ్య, సివిల్ సప్లై డీటీ శేషయ్య, సచివాలయ కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సాక్షి, భీమవరం: ఇద్దరు వ్యక్తులు గొడవపడుతుండగా మధ్యలో వెళ్లిన మరొకరికి గాయాలైన ఘటన ఇది. భీమవరం వన్‌టౌన్ ఏఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుంకర పద్దయ్య వీధికి చెందిన నమ్మి శ్రీను మంగళవారం రాత్రి కొత్త బస్టాండ్ వద్దకు వెళ్లగా అక్కడ పిల్లి ఏసు, ఒక ఆటో డ్రైవర్ గొడవ పడుతున్నారు. పిల్లి ఏసు ఆటో డ్రైవర్‌ను కర్రతో కొట్టబోయి శ్రీనును కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు.

రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని వీరవాసరం సర్పంచ్ చికెలే మంగతాయారు తెలిపారు. వీరవాసరం గ్రామ సచివాలయంలో బుధవారం 34 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల కనకారావు, మద్దాల సత్యనారాయణమూర్తి, మతల కాశీవిశ్వేశ్వరరావు, వెంపల్ల నర్సింహమూర్తి, పైడికొండల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపునకు టీడీపీ కుట్ర

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: టీడీపీ ప్రజాబలం పూర్తిగా కోల్పోయిందని, దీంతో దొడ్డి దారిన అధికారంలోకి రావాలని చంద్రబాబు నానా తంటాలు పడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో పదివేల వైఎస్సార్ సీపీ ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దీనిలో భాగంగా భీమవరం నియోజకవర్గంలో 10 వేల మంది వైఎస్సార్ సీపీ ఓట్లను తొలగించేందుకు ఇక్కడ టీడీపీ నాయకులు కుట్ర చేశారని ఆరోపించారు. బతికున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను మరణించినట్లుగా చూపించి వారి ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. సమాచార హక్కు చట్ట ప్రకారం తాము ఓటర్ల జాబితాను తీసుకుని పరిశీలించడం జరిగిందని అన్నారు. తన తల్లి గ్రంధి వెంకటరత్నం, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, నాచు శేషగిరిరావు లాంటి అనేకమంది బతికుండగానే వారు మరణించారని ఎన్నికల అధికారులకు టీడీపీ తప్పుడు రిపోర్ట్ చేయడం చాలా దారుణమని అన్నారు. ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు ఉన్నాయని చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయటం చాలా విచిత్రంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ దొంగ ఓట్లు జాయిన్ చేస్తుంది అని చెప్పడం చూస్తుంటే దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందన్నారు. భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి సంబంధించిన 10 వేల ఓట్లు తొలగించాలని టీడీపీ కుట్ర చేయాలని ప్రయత్నించడం చూస్తుంటే నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి పూర్తిగా దిగజారిందని అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 3.60 కోట్ల ఓట్లు ఉంటే ఆ జాబితాలో 60 లక్షల దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి చంద్రబాబు జాయిన్ చేసిన దొంగ ఓట్లను తొలగిస్తున్నారని, దీంతో చంద్రబాబుకు ఆందోళన మొదలై 2024 ఎన్నికలలో గత ఎన్నికలలో వచ్చిన 23 సీట్లు కూడా రావనే భయంతో బురద జల్లుతున్నారని విమర్శించారు. కాగా 60 సంవత్సరాల వయసు పైబడి పెన్షన్ తీసుకుంటున్న వారందరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేస్తారనే అనుమానంతో డెత్ ఓట్లుగా పదివేల ఓట్లు తొలగించమని ఫిర్యాదు చేయటంపై చంద్రబాబు నీచ రాజకీయం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు సరైన గుణపాఠం ప్రజలే చెబుతారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు.

ఓపెన్ స్కూల్ విధి విధానాలపై అవగాహన



ఓపెన్ స్కూల్ విధి విధానాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ను విద్యాశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ సందర్శించారు. ఓపెన్ స్కూల్‌కు కాళ్ల హైస్కూల్ ఎంపిక కావడంతో బుధవారం ఆయన హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ సంబంధించి విధి విధానాలను తెలియజేశారు. ఎంఈఓ కనకరాజు, కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ సిబ్బందికి ఓపెన్ స్కూల్‌లో చేరడం వల్ల వచ్చే సదుపాయాలను వివరించారు. అనంతరం మండల కేంద్రంలో కాలజ్ఞానంలో ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు.

చింతలపాటి బాపిరాజు పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు



డీఈఓ వెంకటరమణ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని శ్రీచింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాల జిల్లా క్రీడా ప్రతిభ అవార్డు పొందింది. 2022-23 ఏడాదికిగాను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో సాధించిన విజయాలు, పాయింట్ల ఆధారంగా జిల్లా క్రీడా ప్రతిభా అవార్డులో ద్వితీయ స్థానం సాధించిందని వ్యాయామ ఉపాధ్యాయుడు జీపీసీ శేఖర్‌రాజు తెలిపారు. ఈ మేరకు డీఈఓ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అవార్డు సాధించిన పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు, శేఖర్‌రాజు, డీవీ రామభద్రరాజులను డీఎన్నార్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తదితరులు అభినందించారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



ఆకివీడు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో రాఖీ ఆకారంలో కూర్చొన్న విద్యార్థినులు

ఆకివీడు: మహిళలకు రక్షణగా, మహిళా పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన ఉందని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. రాఖీ పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో మహిళలు, విద్యార్థులు, నాయకురాళ్లు పీవీఎల్‌కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి, రక్షణకు గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. మహిళా రిజర్వేషన్ కోసం పోరాటాలు చేసినా ఫలితం దక్కలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. డ్వాక్రా రుణాల మాఫీని అంచెలంచెలుగా చేస్తున్నారని చెప్పారు. సున్నా వడ్డీ సౌకర్యం మహిళలకు కల్పించారని చెప్పారు. పీవీఎల్‌కు రాఖీ కట్టిన వారిలో మాదివాడ మహిళ గోరీ పుష్పావతి, సరోజినీనాయుడు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు, ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్
- తుందుర్రులో వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ



తుందుర్రులో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్

భీమవరం అర్బన్: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో బుధవారం మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో వరి పొలాలను రెండులోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. చీడపీడలు తట్టుకునే వరి వంగడాలను పంటకు ఎంచుకోవాలన్నారు. ఎకరానికి 4 టన్నుల పశువుల పేడను దుక్కుల్లో వేయాలన్నారు. పచ్చిరొట్ట సాగు చేసి దమ్ము చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. కిలో విత్తనాలకు 10 గ్రాముల సూడోమోనాస్ లేదా 3 గ్రాముల కార్బన్‌డిజంతో విత్తన శుద్ధి చేస్తే తప్పలు తాళ్లు వేచ్చే అవకాశాలు ఉండవన్నారు. వరినారి చివర కొనలు తుంచి నాటితే కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. వరి నారిని పైపైన నాటితే పిలకలు వేసి వరి దుబ్బు చేస్తుందన్నారు. మురుగునీటిని బయటకు పంపే సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరానికి నత్రజని 32-36 కిలోలు, భాస్వరం 24 కిలోలు, పొటాషియం 16-24 కిలోల మధ్య వేయాలన్నారు. సమగ్ర కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, ఎలుకల నివారణ, కోత దశలోను సస్య రక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ ఆరేటి వెంకట సత్య వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు), డీఆర్‌సీ వ్యవసాయ అధికారిని జి.బాల నాగేశ్వరమ్మ, వీఏఏ స్వామి నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ కర్ణాటక ఇన్‌చార్జిగా పువ్వాడ



పువ్వాడ రాజా అమర్‌నాథ్

ఆకివీడు ఎంఎస్ఎంఈ కర్ణాటక ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు ఏపీ ఎంఎస్ఎంఈ వైస్ చైర్మన్, అడ్వకేట్ పువ్వాడ రాజా అమర్‌నాథ్ చెప్పారు. స్థానికంగా తన నివాసంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 2న కర్ణాటక ఎంఎస్ఎంఈ ఇన్‌ఛార్జిగా బాధ్యతల స్వీకరణ, ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంఎస్ఎంఈ ద్వారా యూనిట్లు, ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునే వారు 5 నుంచి 10 మంది వరకూ గ్రూపుగా ఏర్పడి, దరఖాస్తు చేసుకోవచ్చునని అమర్‌నాథ్ చెప్పారు. రూ. 5 లక్షల నుంచి రూ. 5 కోట్ల వరకూ రుణసదుపాయం కల్పిస్తున్నట్లు, ఏ విధమైన డాక్యుమెంట్‌లు సమర్పించాల్సిన అవసరం లేదని వివరించారు. త్వరలోనే ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈ ద్వారా రుణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వివరించారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

సాక్షి, భీమవరం: భీమవరం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చిన్మయ ప్రభ ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఇమిడి వెంకటరత్నం హాజరై మాట్లాడుతూ సమాజ సేవ చేయడానికి రోటరీ క్లబ్ ఒక మంచి వేదిక అని అన్నారు. భీమవరం రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గుండు కిషోర్ , షేక్ బాబాజీ సాహెబ్, కోశాధికారిగా బొండా వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా అశ్మఖలాల్ జైన్, జాయింట్ సెక్రెటరీగా వీవీఎస్ ప్రసాద్, 25 మంది నూతన సభ్యులతో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. నూతన సభ్యులకు అసిస్టెంట్ గవర్నర్ రోటరీ బ్యాడ్జీలు అందజేశారు. బొండా వెంకట సుబ్బారావు, వబిలిసెట్టి పట్టాభి రామయ్య, మడిపల్లి శేఖర్, సాయి దుర్గా ప్రసాద్, గంధ శ్రీదేవి, ఓలేటి శ్రీనివాస్, కనగల కిషోర్, గుండు గిరి, గుండు సుధీర్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

సాక్షి, భీమవరం: విద్యార్థుల్లో కమ్యూనిటీ స్కిల్స్ పెంచడానికి, వర్క్‌బుక్ విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ఉపయోగం, లాభనష్టాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎమ్, ఎస్‌యూఎస్ స్కూల్స్ హెచ్ఎంలు జె సుధారాణి, పి మురళీకృష్ణ, రిసోర్స్ పర్సన్ ఎస్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామయ్యకు సత్కారం




తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా వెంకట్రామయ్యను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఆరు దశాబ్దాలపాటు ఆధ్యాత్మిక, కళా రంగాల నిర్వహణ, వ్యాఖ్యాతగా తెలుగు భాషా అభివృద్ధికి చెరుకువాడ వెంకటరామయ్య అందించిన సాహితీ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని భీమవరంలో బుధవారం అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చెరుకువాడ వెంకటరామయ్యను ఘనంగా సత్కరించారు. శాలువాలుతో సత్కరించి రామ్మూర్తి పంతులు చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు. కార్యక్రమంలో అరసవల్లి ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్, ఎం రామనాగేశ్వరరావు, కొమ్ము శ్రీనివాస్, మిర్చిపాటి గున్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు

వీరవాసరం: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దయానంద్ తెలిపారు. మండల కేంద్రమైన వీరవాసరం, అండలూరు, రాయకుదురు గ్రామాల్లో మంచినీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచనల మేరకు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో జరుగుతున్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకారావు, గెడ్డం భాస్కరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాధిక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.







నేడు పెదఅమిరంలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెదఅమీరం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. తాను ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఆకివీడు: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు సెప్టెంబర్ 1న నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచితంగా జరుపుకునే వరలక్ష్మీ వ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



రాయకుదురులో జూనియర్ కళాశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్, రికార్డ్ బుక్స్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని రాయకుదురు సర్పంచ్ గెడ్డం భారతి అన్నారు. వీరవాసరం మండలం రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్, రికార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భారతి మాట్లాడుతూ బ్లూ పార్క్ హేచరీ అధినేత కే వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు సుమారు రూ.35 వేల ఆర్థిక సహాయంతో స్టడీ మెటీరియల్, రికార్డు బుక్స్‌ను విద్యార్థులకు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యా కమిటీ చైర్మన్ గుబ్బల సత్యనారాయణ, గెడ్డం భాస్కరరావు, కాయల వీరాస్వామి, గెడ్డం ముసలయ్య. అంగర వేణు, మెంటే అరుణ, లక్ష్మీ కుమారి, కేవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

